www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 3 జనవరి 2026



జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ 37వ జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు ఏలూరు డిపో గ్యారేజిలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఏలూరు ఆర్‌టిఒ ఎస్‌బి.శేఖర్ మాట్లాడుతూ ప్రతినిత్యం రాష్ట్రవ్యాప్తంగా 55 వాహన ప్రమాదాలు జరుగుతున్నాయని, 23 మంది ప్రాణాలు కోల్పోతున్నారని, రోడ్డుమీద ప్రయాణించేటప్పుడు పూర్తి ఏకాగ్రతతో ఉండాలని, ముందు ఉన్న వాహనాలను దాటేటప్పుడు అన్ని విధాలా చూసుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. ఆర్‌టిసిలో మాత్రమే తక్కువ ప్రమాదాలు జరుగుతాయని, సురక్షిత ప్రయాణం కోసం ఆర్‌టిసిలో ప్రయాణించాలని తెలిపారు. జిల్లా ప్రజారవాణాధికారి ఎస్‌కె.షబ్నం మాట్లాడుతూ 2025లో కొన్ని ప్రమాదాలు జరిగి కొంతమందికి ప్రాణ ప్రమాదం జరిగిందని, సంవత్సరమంతా ప్రమాదాల నివారణతో జాగ్రత్తగా ఉంటారనే ఈ రోడ్డు భద్రత మసోత్సవాలు జనవరి నెలలోనే నిర్వహిస్తామని తెలిపారు.

'పంచాయతీ' జరిగేనా..!

ఎన్నికలపై గ్రామాల్లో తీవ్ర చర్చ
ఏప్రిల్ రెండో తేదీతో సర్పంచుల పదవీ కాలం పూర్తి
జనవరిలో ఎన్నికలంటూ మూడు నెలల క్రితం హడావుడి
ఫ్రీ ఎలక్షన్ షెడ్యూల్ విడుదల చేసిన ఎన్నికల కమీషన్
మళ్లీ మౌనం వహించిన ప్రభుత్వం, గ్రామాల్లో ఎన్నికల హైటెన్షన్
ఏలూరు జిల్లాలో 547, పశ్చిమలో 409 పంచాయతీలు



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పంచాయతీ ఎన్నికలపై గ్రామాల్లో హైటెన్షన్ నెలకొంది. ప్రభుత్వం సకాలంలో పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తుందా.. లేక ప్రత్యేక అధికారుల పాలనకు దిగుతుందా అన్న చర్చ గ్రామాల్లో విస్తృతంగా సాగుతోంది. గత ఏడాది సెప్టెంబర్‌లో జనవరి నెలలో పంచాయతీ ఎన్నికలంటూ ప్రభుత్వం నర్మగర్భంగా పేర్కొంది. ఎన్నికల కమీషన్ ఫ్రీ ఎన్నికల షెడ్యూల్ సైతం విడుదల చేసింది. దీంతో ఇక పంచాయతీ ఎన్నికలు షూరూ అంటూ పెద్ద ఎత్తున ప్రచారం నడిచింది. తర్వాత ప్రభుత్వం మౌనం వహించడంతోపాటు, పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఎటువంటి ప్రకటనలు లేకపోవడంతో ఏం జరుగుతుందన్న ప్రశ్న గ్రామాల్లో చర్చనీయాంశంగా మారింది. పంచాయతీ సర్పంచులుగా పోటీలోకి దిగాలని ఆశిస్తున్న అభ్యర్థుల్లో ఉత్కంఠ కొనసాగుతోంది. ఏలూరు జిల్లాలో 547, పశ్చిమగోదావరి జిల్లాలో 409 పంచాయతీలు ఉన్నాయి. 2021 ఫిబ్రవరిలో పంచాయతీ ఎన్నికలు జరిగాయి. ఏప్రిల్ రెండో తేదీ నుంచి పంచాయతీల పాలన మొదలైంది. 2026 ఏప్రిల్ రెండో తేదీతో పంచాయతీ సర్పంచుల పదవీ కాలం ముగియనుంది. దీంతో ప్రభుత్వం సకాలంలో ఎన్నికలు జరుపుతుందా అన్న అనుమానాలు సర్వత్రా నెలకొన్నాయి. జనవరిలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు, ఈలోగా అందుకు సంబంధించిన ప్రక్రియ పూర్తిచేయాలంటూ సెప్టెంబర్ మూడో తేదీన ఎన్నికల కమీషన్ ప్రభుత్వానికి లేఖ రాసింది. ఫ్రీ ఎలక్షన్ షెడ్యూల్ సైతం విడుదల చేసింది. అక్టోబర్ 16వ తేదీలోగా డీలిమిటేషన్ ప్రక్రియ, రిజర్వేషన్లు, ఖరారు చేయాలని, అక్టోబర్ 16వ తేదీ నుంచి నవంబర్ 15వ తేదీ లోపు వార్డుల వారీగా ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని, నవంబర్ ఒకటో తేదీ నుంచి 15వ తేదీలోపు రిటర్నింగ్ అధికారులను నియమించుకోవాలని, నవంబర్ 16 నుంచి పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసుకుని తుది జాబితా సిద్ధం చేసి ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని పేర్కొంది. 2026 జనవరిలో పంచాయతీ ఎన్నికలంటూ ఫ్రీ ఎలక్షన్ షెడ్యూల్‌లో ఎన్నికల కమీషన్ పేర్కొంది. జనవరి నెల వచ్చేసింది. ఇప్పటి వరకూ ఎన్నికల కమీషన్ చెప్పిన ఏ ఒక్క ప్రక్రియ పూర్తికాలేదు. పంచాయతీ ఎన్నికలపై ఒక్క అడుగు ముందుకు పడిన దాఖలాలు లేకుండా పోయాయి.

ఆశావహుల్లో తీవ్ర ఉత్కంఠ..

పంచాయతీ ఎన్నికలను ప్రభుత్వం సకాలంలో నిర్వహిస్తుందన్న ఆశతో సర్పంచిగా పోటీ చేయాలనుకున్న ఆశావహులంతా జనాల్లో తిరుగుతున్నారు. ఎంఎల్‌ఎలు, స్థానిక నేతల వద్ద తమ మనసులోని కోరిక చెప్పి ముందుకు సాగుతున్నారు. పలు చోట్ల టిడిపి, జనసేనకు చెందిన నేతల మధ్య పదవీ పోటీ సైతం నెలకొంది. గత రిజర్వేషన్ల ఆధారంగా లెక్కలు వేసుకుని అభ్యర్థుల ఎంపికపై ఇప్పటికే వైసిపి, టిడిపి, జనసేన నేతలు కసరత్తు చేశారు. ఆర్థిక, అంగబలం ఉన్నవారికి అవకాశాలు ఇచ్చేందుకు నిర్ణయానికి సైతం వచ్చారు. పార్టీలన్నీ సర్పంచి ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల విషయంలో ఒక స్పష్టతకు వచ్చాయి. అధికార పార్టీకి చెందిన కూటమి నుంచి పోటీ చేసే అభ్యర్థులు గ్రామాల్లో ఇప్పటికే జనాల్లో తిరుగుతూ ప్రభుత్వ పథకాలను వివరిస్తూ ముందుకు సాగుతున్నారు. ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులు సైతం జనాలతో మమేకం అవుతున్నారు. పంచాయతీ ఎన్నికలు సకాలంలో నిర్వహించాలంటే రిజర్వేషన్లు, పోలింగ్ బూత్‌ల ఏర్పాటు వంటి ప్రక్రియలు పూర్తిచేయాల్సి ఉంటుంది. అంతేకాకుండా కొత్త పంచాయతీల ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో చాలా పంచాయతీలకు సంబంధించి వినతులు వచ్చాయి. పంచాయతీల విభజన ప్రక్రియను నిలుపుదల చేస్తున్నట్లు ఇటీవల ప్రభుత్వం మళ్లీ ఆదేశాలు ఇచ్చింది. సకాలంలో పంచాయతీ ఎన్నికలు జరగాలంటే ప్రభుత్వం అందుకు సంబంధించిన ప్రక్రియకు పూర్తికి అధికారులకు ఆదేశాలు జారీ చేయాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి మాత్రం సరైన స్పందన లేకుండా పోయింది. కూటమి సర్కార్ పంచాయతీ ఎన్నికలు సకాలంలో నిర్వహిస్తుందో లేదో చూడాల్సి ఉంది.

మాతా, శిశు మరణాలు జీరో శాతం చేయాలి

వైద్యులు అప్రమత్తతో వైద్య సేవలందించాలి - జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో మాతా, శిశు మరణాలు జీరో శాతం నమోదులో వైద్యులు, సిబ్బంది అప్రమత్తతో వైద్య సేవలందించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో మాతా, శిశుమరణాలపై సంబంధిత కమిటీ సభ్యులు, బాధిత కుటుంబాల సమక్షంలో వైద్యాధికారులు, సిబ్బందితో కలిసి జిల్లాలో జులై నుంచి సెప్టెంబరు మూడు నెలలకు గాను మాతా మరణాలు 1, శిశు మరణాలు 47 కేసుల వారీగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అధ్యక్షతన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో మాతా, శిశు మరణాలు జరగకూడదనే లక్ష్యంతో పనిచేయాలని ఆదేశించినా, ప్రతినెలా మరణాలు నమోదు కావడంపై ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబానికి మహిళ మూలస్తంభం అని, ఆమె చనిపోతే కుటుంబం మొత్తం చిన్నాభిన్నం అవుతుందని తెలిపారు. జిల్లాలో మాతా, శిశు మరణాలు జీరో శాతం ఉండేలా కృషి చేయాలని తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులతో కూడా స్వయంగా మాట్లాడి వివరాలను తెలుసుకున్నామని అన్నారు. కొన్ని కేసుల్లో ప్రయివేటు ఆసుపత్రులు గర్భిణికి ప్రసూతి సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల్లో నిర్లక్ష్యం చేయొద్దని, ప్రతి కేసునూ చాలెంజ్‌గా తీసుకుని తల్లీ, బిడ్డ క్షేమంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. హై రిస్క్ ప్రెగ్నెన్సీ కేసుల్లో చివరివరకూ వేచి చూడకుండా గర్భం దాల్చిన నాటి నుండే ఎక్కువ జాగ్రత్త తీసుకోవాలన్నారు. నెలలు నిండని పిల్లలు ముందుగా డెలివరీలు ఎందుకు అవుతున్నాయని వైద్యనిపుణులు, వైద్యులు అధ్యయనం చేయాలని తెలిపారు. పిల్లలు పుట్టినప్పుడు తల్లి పాలు ఇచ్చేవిధానం, ఆరోగ్య గుణాలపై తదితర విషయాలను బాలింతలకు అవగాహన కల్పించాలని జిల్లా ఐసిడిఎస్ పీడీని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పిజె.అమృతం, డిసిహెచ్‌ఎస్ బి.పాల్ సతీష్ కుమార్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి యు.శోభ, ఐసిడిఎస్ పీడీ పి.శారద, వైద్య నిపుణులు లావణ్య, సుజాత, కళ్యాణ్, అచ్యుతరామయ్య తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతుల రక్షణకు కొత్త చట్టం తేవాలి

రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్



మాట్లాడుతున్న శ్రీనివాస్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కౌలు రైతుల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం కొత్త చట్టం వెంటనే తీసుకురావాలని, అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం, రబీ పంట రుణాలు అందించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఏలూరు అన్నే భవనంలో దేవాలయ కౌలు రైతుల సమావేశాన్ని అనగాని శ్రీరామ్మూర్తి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ 2019 పంట సాగుదారు హక్కు చట్టం రద్దు చేసి కొత్త చట్టం తీసుకొచ్చి కౌలు రైతులకు మేలు చేస్తామని ఇచ్చినా హామీ అమలు చేయకుండా ఆలస్యం చేయడం తగదన్నారు. కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులిచ్చేలా కొత్త కౌలు రైతుల చట్టం తేవాలన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ప్రతి కౌలు రైతుకూ రూ.20 వేలు పెట్టుబడి సాయం అందించి ఆదుకోవాలన్నారు. దేవాలయ భూముల కౌలు రైతులకు కౌలు గుర్తింపు కార్డులు అందించాలన్నారు. ముదినేపల్లి మండలం వడాలి గ్రామానికి చెందిన సర్వీస్ ఇనాం భూముల కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందించి పంట రుణాలు,నష్టపరిహారాలు, పెట్టుబడి సాయం అందించాలని డిమాండ్ చేశారు. వడాలి ఇనాం భూముల కౌలు రైతుల హక్కులు కాపాడాలన్నారు.

పెంచిన ఎరువుల ధరలు తగ్గించాలి

పెంచిన కాంప్లెక్స్ ఎరువుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కాంప్లెక్స్ ఎరువులు 10:26:26 ధరను బస్తాకు రూ. 1700 నుండి 1920 కు, 14:35:14 బస్తా ధర రూ.1800 నుండి రూ.1950కు, 20:20:13 బస్తా ధర రూ.1300 నుంచి రూ.1400 పెంచి రైతులపై భారం వేయడం దారుణమని విమర్శించారు. సమావేశంలో పల్లి శ్రీధర్, కుంచాల బుల్లిబాబు, కొరికాని వెంకటేశ్వరరావు, బెందు పాపారావు, వెలమల రాంబాబు, ముంగట నాగవరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేత



పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - దెందులూరు

రీ సర్వే ప్రాజెక్టులో భాగంగా మండలంలోని గుడిగుంట గ్రామ శివారు జోగన్న పాలెం సచివాలయంలో శుక్రవారం కలెక్టర్ కె.వెట్రిసెల్వి రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ రాజముద్ర, క్యూఆర్ కోడ్ ముద్రించిన పట్టాదార్ పాస్ పుస్తకాలను రైతులకు అందించడం జరుగుతుందన్నారు. గుడిగుంట గ్రామంలోని భూమి గల రైతులకు రెవెన్యూ డివిజినల్ అధికారి, ఏలూరు గ్రామ సర్పంచి చేతుల మీదుగా కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేశారు. అక్కడకు వచ్చిన రైతులను వారి సమస్యలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ ఎ.శ్రీనివాసరావు, రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్, ఆర్.రవిచంద్ర, ఆర్ఐ విఎస్.ఆదిత్య, జోగన్నపాలెం సర్పంచి పి.రాజేశ్వరి, కో-ఆపరేటివ్ బ్యాంకు ఛైర్మన్ పి.మధు పాల్గొన్నారు.

రెండో రోజుకు గెస్ట్ ఫ్యాకల్టీ అధ్యాపకుల నిరసన



నిరసన తెలుపుతున్న గెస్ట్ ఫ్యాకల్టీ అధ్యాపకులు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని నూజివీడు ట్రిపుల్ ఐటి క్యాంపస్‌లో గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేస్తున్న అధ్యాపకులు చేపట్టిన నిరసన శుక్రవారం రెండో రోజుకు చేరింది. ఈ సందర్భంగా పలువురు గెస్ట్ ఫ్యాకల్టీ అధ్యాపకులు మాట్లాడుతూ కాంట్రాక్టు గెస్ట్ ఫ్యాకల్టీకి ఎనిమిది సంవత్సరాలుగా ఎలాంటి ప్రయోజనాలు, కనీస వేతనం అందించకపోవడం సరికాదన్నారు. 2018లో రిక్రూట్ అయిన కాంట్రాక్టు గెస్ట్ ఫ్యాకల్టీ ఎగ్జామ్ రాసి ఇంటర్వ్యూ క్వాలిఫై రూల్ ఆఫ్ రిజర్వేషన్ ద్వారా నాలుగు ట్రిపుల్ ఐటిల్లో నియమించడం జరిగిందని, ఆ రోజు ఉన్న ఉన్నత అధికారులు మబ్బు పెట్టి గెస్ట్ ఫ్యాకల్టీ అనే డిజిగ్నేషన్ ఇచ్చారని, ఈరోజుకు కూడా రెడిసిగ్నేటి చేయడం అనేది దారుణమని తెలిపారు. ఇప్పటికైనా ఆర్‌జియుకెటి ఉన్నతాధికారులు చొరవ తీసుకొని సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని క్యాంపస్‌లో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నజీర్ హుస్సేన్, భవ్య రవి నాయక్, సునీత, రాజేంద్రరెడ్డి, నేతాజీ తదితరులు పాల్గొన్నారు.

పోలవరం జిల్లాలో 'పోలవరం'ను కలపాలి

కొనసాగిన రిలే నిరాహార దీక్షలు



రిలే నిరాహార దీక్షల్లో నేతలు

ప్రజాశక్తి - పోలవరం

ప్రజాభిప్రాయం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం పోలవరం జిల్లా ప్రకటించారని సిపిఎం మండల కార్యదర్శి కారం భాస్కర్ విమర్శించారు. మండల కేంద్రంలో పోలవరం జిల్లా కోసం చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు సిపిఎం మండల కమిటీ బృందం, కార్యదర్శి కారం భాస్కర్, బొరగం భూచంద్రరావు, మడివి చలపతిరావు, తామ బాలకృష్ణ దీక్షలకు మద్దతు పలికారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కారం భాస్కర్ మాట్లాడుతూ ప్రభుత్వం అశాస్త్రీయంగా ప్రజాభిప్రాయానికి భిన్నంగా పోలవరం జిల్లా ప్రకటించిందన్నారు. పోలవరం నిర్వాసితుల కోసమే పోలవరం జిల్లా అని పేరు పెట్టామని మంత్రులకు చంద్రబాబు నిత్యం గొప్పలు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రతి సోమవారం పోలవరం అన్న చంద్రబాబు పోలవరం లేని జిల్లా ప్రకటించడం ఏంటన్నారు. ఎన్నికల ముందు ప్రకటించిన పోలవరం జిల్లా చేయాలని, పోలవరం త్యాగాలకు ప్రభుత్వం విలువ ఇవ్వాలన్నారు. జిల్లా కోసం చేస్తున్న దీక్షలకు సంపూర్ణ మద్దత్తు తెలిపారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోరాటానికి సిఐటియు మద్దతు



మద్దతు తెలుపుతున్న సిటిఐయు నేతలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని ట్రిపుల్ ఐటి క్యాంపస్‌లోని పరిపాలన కార్యాలయం వద్ద అసిస్టెంట్ ప్రొఫెసర్లు నిర్వహిస్తున్న ధర్మ పోరాటానికి సిఐటియు మద్దతు ప్రకటించింది. ఈ మేరకు సిఐటియు నేతలు జి.రాజు, ఎకెడి.ప్రసాద్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఆందోళనకు శుక్రవారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని కోరారు. కరోనా సమయంలోను అతి తక్కువ వేతనాలకు విద్యార్థులకు పాఠాలు బోధించారని అన్నారు. నేటి నిత్యావసర ధరలకు అనుగుణంగా అసిస్టెంట్ ప్రొఫెసర్లకు వేతనాల పెంచాలని డిమాండ్ చేశారు. వారి సమస్యలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. అనంతరం ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ అమరేంద్ర కుమార్‌తో సిఐటియు నాయకులు మాట్లాడి సమస్య జఠిలం కాకముందే సమస్యను పరిష్కరించాలని కోరారు.

సాంకేతిక సమస్యలతో రుణాలకు ఆటంకం

ఎస్‌సి కార్పొరేషన్ ఇడి ఎం.ముక్కంటి - 'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సాంకేతిక సమస్యల కారణంగా ఎస్‌సి కార్పొరేషన్ రుణాల ప్రక్రియకు సంబంధించి ఆటంకం ఏర్పడిందని ప్రభుత్వ ఆదేశాల వచ్చిన తర్వాత ప్రక్రియ ప్రారంభించడం జరుగుతుందని ఎస్‌సి కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు ఎం.ముక్కంటి తెలిపారు. శుక్రవారం 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన 'రుణాల కోసం నిరీక్షణ' కథనానికి ఆయన స్పందించి వివరణ ఇచ్చారు. ప్రభుత్వం షెడ్యూల్డ్ కులాల అభ్యర్థులకు ఆర్థికసాయం అందించేందుకు 2025 ఏప్రిల్ ఒకటో తేదీన అందుకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. దరఖాస్తు నమోదుకు ఏప్రిల్ 14వ తేదీ నుంచి మే పదో తేదీ వరకూ గడువు ఇవ్వడం జరిగింది. ఒబిఎంఎంఎస్ పోర్టల్ మే ఏడో తేదీ సాయంత్రం వరకూ పని చేసింది. అప్పటి వరకూ మాత్రమే దరఖాస్తులు స్వీకరణ జరిగింది. ఒబిఎంఎంఎస్ పోర్టల్ పనిచేయకపోవడంపై రాష్ట్ర ఎస్‌సి కార్పొరేషన్, తాడేపల్లిలోని ఉన్నతాధికారులను సంప్రదించగా సాంకేతిక సమస్యల వల్ల సదరు వెబ్‌సైట్ పనిచేయడం లేదని తెలిపారు. ఒబిఎంఎస్ఎస్ పోర్టల్ పనిచేసే విషయంలోనూ, అభ్యర్థులకు ముఖాముఖీలు (ఇంటర్వ్యూలు) నిర్వహించే విషయంలో ప్రభుత్వ ఆదేశాలు వచ్చిన తర్వాత ఆ వివరాలను పత్రికా ప్రకటన ద్వారా అభ్యర్థులకు తెలియజేస్తామని తెలిపారు.

సిఐటియు మహా ప్రదర్శనకు తరలిరావాలి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

ఈ నెల నాలుగో తేదీన విశాఖపట్నంలో నిర్వహించనున్న శ్రామిక మహా ప్రదర్శన, బహిరంగ సభకు కష్టజీవులంతా పెద్దసంఖ్యలో తరలిరావాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి పిలుపునిచ్చారు. మహాసభకు సంబంధించి కొయ్యలగూడెంలో శుక్రవారం నిర్వహించిన పలు సన్నాహక సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశాలకు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.రాంబాబు అధ్యక్షత వహించారు. డిసెంబర్ 31 నుంచి జనవరి నాలుగో తేదీ వరకు విశాఖ నగరంలో సిఐటియు అఖిలభారత 18వ మహాసభ జరుగుతున్న సందర్భంగా జనవరి నాలుగో తేదీన భారీ ప్రదర్శనతో పాటు బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. సంపద సృష్టికర్తలైన కార్మికులు, వ్యవసాయ కార్మికులు, రైతులు సృష్టించిన సంపదను పెట్టుబడి దారులు, భూస్వాములు, సామ్రాజ్యవాదులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా లు దోచి పెడుతున్నాయని విమర్శించారు. ఇప్పటికే వేలాది మంది ప్రదర్శన, బహిరంగ సభలకు సిద్ధంగా ఉన్నారని, ప్రతి కార్మికుడు, వ్యవసాయ కార్మికుడు ఈ మహాసభను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఆకుల దుర్గారావు, రైస్ మిల్లు కార్మిక నాయకులు కె.సీతారామరెడ్డి, సిహెచ్.సత్య నారా యణ, సురేష్, వంకా దుర్గారావు, డి.రమేష్, బజారు జట్టు కార్మిక నా యకులు ఎస్.శివకుమార్, సిహెచ్.మరిడయ్య, పి.తమ్మారావు, పాల్గొన్నారు.

చింతలపూడి : విశాఖపట్నంలో సిఐటియు మహాసభ పెద్దఎత్తున జరుగుతుందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌విఎస్.నారాయణ అన్నారు. నాలుగో తేదీన జరిగే ప్రదర్శన బహిరంగ సభలో పాల్గొనేందుకు మండలంలోని వంద మంది కార్మికులు పట్టణ కేంద్రం నుంచి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌విఎస్.నారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా పెట్టుబడిదారులకు కట్టబెట్టే విధానానికి వ్యతిరేకంగా, పని గంటల పెంపుపై చర్చించి రానున్న కాలంలో కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం కొనసాగించేందుకు రూపకల్పన జరుగుతుందన్నారు. అనంతరం సిఐటియు మండల కన్వీనర్ నత్త వెంకటేశ్వరరావు, అంగన్వాడీ యూనియన్ జిల్లా నాయకురాలు బిజెఎన్.కుమారి, జి.సరళాదేవి, ఆశ యూనియన్ జిల్లా నాయకురాలు సిహెచ్.పుణ్యవతి జెండా ఊపి చలో విశాఖ బస్సులను ప్రారంభించారు.

ఎర్రకాలువ ఇరిగేషన్ మిగులు భూముల్లో

చెట్లను నరికి అమ్ముతున్నవారిపై చర్యలు తీసుకోవాలి

వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఎర్రకాలువ ఇరిగేషన్ మిగులు భూముల్లో అక్రమంగా చెట్లను నరికి అమ్ముతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తామా ముత్యాలమ్మ, పి.రామకృష్ణ ఓ ప్రకటన విడుదల చేశారు. ఎర్రకాలువ మిగులు భూముల్లో ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న పేదలపై భూస్వాములు అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులు గురి చేస్తుంటే ఇరిగేషన్ అధికారులు మొద్దు నిద్ర పోతున్నారని పేర్కొన్నారు. ఇప్పుడు ఇరిగేషన్ భూముల్లో ఉన్న ప్రభుత్వ సంపదను అక్రమంగా, దౌర్జన్యం చేసి కొబ్బరి, మద్రి, వేప చెట్లను నరికి అక్రమ పద్ధతిలో అమ్ముతుంటే ఇరిగేషన్ అధికారులు చోద్యం చూస్తున్నారా అని పేర్కొన్నారు. ఇరిగేషన్ భూముల్లో పంటను కాపాడాల్సిన అధికారులే భూస్వామ్యులకు వత్తాసు పలుకుతున్నారని తెలిపారు. కొంతమంది భూస్వాములు యలమాటి దొరబాబు, అనపర్తి వెంకటేశ్వరరావు, పామర్తి రాజుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామాల్లో అక్రమంగా కొబ్బరి, మద్రి, తాటి, వేప చెట్లు నరుకుతున్న భూస్వాములపై మాత్రమే కాకుండా, ఈ అక్రమాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరిస్తున్న ఇరిగేషన్ అధికారలుపై జిల్లా ఉన్నతాధి కారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

జంగారెడ్డిగూడెం : ఇరిగేషన్ భూముల్లో అక్రమంగా ప్రవేశించి కొబ్బరి మొక్కలు, మద్రి, వేప నరికి టన్ను లెక్క కొబ్బరి చెట్లు అమ్మి సంపదను దోచుకుని దందాలు చేస్తున్న తాడువాయి గ్రామ భూస్వాములపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.జీవరత్నం ఇరిగేషన్ అధికారులను డిమాండ్ చేశారు. ఇరిగేషన్ భూముల్లో కొబ్బరి మొక్కలు నరికే ప్రదేశాన్ని శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. ఈ అక్రమాలపై తాను ఎన్నోసార్లు ఇరిగేషన అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. వెంటనే భూస్వాములపై కేసులు నమోదు చేసి ఇరిగేషన్ భూములను చెట్లను సంపదను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులు స్పందించకపోతే వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని ఎం.జీవరత్నం హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పటాన్, మస్తాన్, కంపరం, దుర్గారావు, గ్రామ వ్యవసాయ కార్మికులు జి.సూర్యకిరణ్, తదితరులు పాల్గొన్నారు.

నిజాన్ని నిర్భయంగా రాసేది ప్రజాశక్తి



నూజివీడు టౌన్ : క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సబ్ కలెక్టర్ వినూత్న

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నిత్యం ప్రజల పక్షాన నిలుస్తూ నిజాలను నిర్భయంగా అందిస్తున్న తెలుగు దినపత్రిక ప్రజాశక్తి అని నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, ఎంపిడిఓ చెన్న రాఘవేంద్రనాథ్ అన్నారు. పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో, మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాలలో ప్రజాశక్తి తెలుగు దినపత్రిక నూతన సంవత్సర క్యాలెండర్‌ను అధికారుల బృందం శుక్రవారం ఆవిష్కరించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాలను వార్తాపత్రికలు బాధ్యతాయుతంగా ప్రచారం చేయాలన్నారు. నిజమైన లబ్ధిదారులకు చేరే రీతిగా వార్తలను అందించాలన్నారు. అనాదిగా కార్మికులు, కర్షకులు, శ్రామికులు, అసంఘటిత రంగ కార్మికుల కోసం పనిచేసిన పత్రికగా ప్రజాశక్తి ఖ్యాతి పొందినట్లు చెప్పారు. అన్ని తరగతుల ప్రజల ఆదరాభిమానాలు పొందుతూ మరింత దినదినాభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నూజివీడు డివిజన్ ఫారెస్ట్ రేంజర్ సత్యనారాయణ, మున్సిపల్ వైస్ ఛైర్మన్ వెంకటేశ్వరరావు, టిడిపి సీనియర్ నేత ముసునూరు రాజా, టిడిపి నాయకులు ఆరేపల్లి రాంబాబు, కాంట్రాక్టర్ చింతమనేని దాసు, ప్రజాశక్తి నూజివీడు పాత్రికేయులు అలెన్, తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు : ప్రజల పక్షాన నిలుస్తున్న ప్రజాశక్తి దినపత్రిక అందరి మన్ననలను పొందుతూ దినదినాభివృద్ధి చెందుతుందని టిడిపి మండలాధ్యక్షులు గద్దె రఘుబాబు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ పిల్లి ఏసుబాబు ఆధ్వర్యంలో ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్‌సి సెల్ నూజివీడు నియోజకవర్గ అధ్యక్షులు కొండేటి బాబి మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన తరగతుల వారికి అండగా ఉండే దినపత్రిక ప్రజాశక్తి అని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి తోట శ్రీను, టిడిపి వలసపల్లి గ్రామ అధ్యక్షులు మెదరమెట్ల సురేంద్ర, గుడిపాడు పార్టీ అధ్యక్షులు మందలపు ధర్మరాజు, అక్కిరెడ్డిగూడెం నాయకులు యలమంచిలి శ్రీకాంత్, ఎస్‌సి సెల్ మండలాధ్యక్షులు గూడపాటి అజయ్, చింతలపల్లి గ్రామ అధ్యక్షులు నాని, సురేష్, పంచాయతీ కార్యదర్శులు, ఎంపిడిఓ కార్యాలయ సిబ్బంది, సచివాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ముసునూరు : క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న రఘుబాబు

యుటిఎఫ్ డైరీ, క్యాలెండర్లు అందజేత

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఏలూరు నగర శాఖ పరిధిలో ఉన్న అన్ని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు యుటిఎఫ్ డైరీ, అధ్యాపక దర్శిని, వాల్ క్యాలెండర్, వాల్ స్టిక్కర్, గ్రీన్ ఇంక్ పెన్, సిఎల్ బుక్స్ పంపిణీ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఇదే సమయంలో ప్రాథమిక పాఠశాలలకు వాల్ క్యాలెండర్లు, వాల్ స్టిక్కర్లు పంపిణీ చేశారు. అలాగే ఉపాధ్యాయులకు సెలవు దరఖాస్తు పుస్తకాలను వ్యక్తిగతంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఈడే శివశంకరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు కెవి.అప్పారావు, నగర అధ్యక్షులు సిహెచ్.షణ్ముఖి, ప్రధాన కార్యదర్శి జొన్నకూటి రాజారావు, కోశాధికారి కోరాడ కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - ఏలూరు

సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చి 20 ఏళ్ల పూర్తయిన సందర్భంగా ఈ చట్టంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సమాచారహక్కు చట్టం అప్పీలేట్ అథారిటీ, జిల్లా అటవీ శాఖాధికారి పివి.సందీప్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా వారి కార్యాలయ పరిధిలో ఉన్న పౌర సమాచార అధికారులతో, సిబ్బందితో సమావేశమై సమాచార హక్కుచట్టం గురించి వివరించి పలు సూచనలు చేశారు. సమాచార హక్కుచట్టం వార్షికోత్సవంలో భాగంగా ప్రజలకు, సిబ్బందికి అవగాహనా కార్యక్రమం, అవగాహనా ర్యాలీ అమీనాపేట, ఏలూరు పరిధిలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, సిబ్బంది, పౌరసమాచార అధికారులు, సిబ్బంది పాల్గొని విజయవంతం చేశారు.

యువతకు ఉద్యోగావకాశాలే కూటమి లక్ష్యం

స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి

ప్రజాశక్తి - పోలవరం

యువతకు ఉద్యోగావకాశాలే కూటమి లక్ష్యమని ఎపి స్పోర్ట్ అథారిటీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి అన్నారు. మండలంలోని చేగొండపల్లిలో ఎపి స్పోర్ట్స్ అథారిటీ కార్యాలయంలో ఆమె మండలంలో క్రీడాకారులకు టీ షర్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పలు కీలక చర్యలు తీసుకుంటుందన్నారు.

మొరాయించిన ఆర్‌టిసి బస్సు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం ఆర్‌టిసి డిపో నుంచి ప్రయాణికులతో బయలుదేరిన బస్సు మండలంలోని దేవులపల్లిలో నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు పలు ఇబ్బందులకు గురయ్యారు. మరో బస్సు కోసం ఎదురుచూశారు. ఆర్‌టిసి బస్సులు తరచూ ఆగిపోతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. వెంటనే కొత్త బస్సులు వేయాలని కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

కొయ్యలగూడెం మండలానికి చెందిన స్పందన స్వచ్ఛంద సేవా సంస్థ అంకాలగూడెం గ్రామానికి చెందిన కూనపాము రవి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించింది. తాపీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న కూనపాము రవి నడుం నొప్పితో ఆసుపత్రికి వెళ్లగా శస్త్రచికిత్స చేశారు. వైద్యం వికటించడంతో ఆయనకు రెండు కాళ్లు పనిచేయడం మానేసి అచేతన స్థితిలో మంచానికే పరిమితమయ్యారు. రవికి భార్య, పాప, బాబు ఉండటంతో కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ విషయాన్ని బోడిగూడెం మాజీ ఉపసర్పంచి గరే వీరభద్రరావు ద్వారా తెలుసుకున్న సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు నాగేశ్వరరావు స్పందించారు. ఆయనతో పాటు సంస్థ సభ్యుడు వీరభద్రరావు కలిసి బాధిత కుటుంబానికి ఒక నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు రూ.మూడు వేల నగదు అందించారు. అదేవిధంగా ప్రతి నెల 25 కిలోల బియ్యం అందించాలని సంస్థ నిర్ణయించింది. ఈ సహాయ కార్యక్రమంలో స్థానిక యువకులు, సంస్థ సభ్యులు పాల్గొన్నారు. బాధిత కుటుంబానికి చేయూతనిచ్చిన స్పందన స్వచ్ఛంద సేవా సంస్థ సేవలను గ్రామస్తులు అభినందించారు.

వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి - పోలవరం

మండలంలో జగన్నాధపేటకు చెందిన విప్పర్తి మహిమ విజయకుమార్ ప్రథమ వర్ధంతి సందర్భంగా విప్పర్తి (బ్రదర్స్) ఆధ్వర్యంలో మహిమా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక గోదావరి నిలయం వృద్ధాశ్రమంలో వృద్ధులకు విందు భోజనాన్ని ఏర్పాటు చేసి అన్నదానం చేశారు. సేవాభావంతో వృద్ధులకు భోజనం అందించడం ద్వారా విజయకుమార్‌ను స్మరించుకోవడం స్ఫూర్తిదాయకమని వారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ విప్పర్తి రవి రత్నకుమార్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ విప్పర్తి అశోక్‌కుమార్, సిఆర్‌పి విప్పర్తి దిలీప్‌కుమార్, జర్నలిస్ట్ విప్పర్తి రంజిత్‌కుమార్, విప్పర్తి రవి(బ్రదర్), వృద్ధులకు భోజనం వడ్డిస్తున్న విప్పర్తి (బ్రదర్) భార్గవ్ (సెక్రటరీ, జిహెచ్‌ఎంసి విశాఖపట్నం) పాల్గొన్నారు. వృద్ధుల ఆశీస్సులు పొందుతూ నిర్వహించిన ఈ అన్నదాన కార్యక్రమం అందరి మనసులను హత్తుకుందని నిర్వాహకులు తెలిపారు.

రైతు సంక్షేమానికి కూటమి కృషి

పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు అన్నారు. మండలంలోని పి.అంకంపాలెం గ్రామంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన పాస్‌బుక్‌ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని పలువురికి ఎంఎల్ఎ చేతులమీదుగా పాస్‌బుక్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బాలరాజు మాట్లాడుతూ రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో రైతులకు రాజముద్రతో ముద్రితమైన నూతన పాస్ బుక్‌లను పంపిణీ చేస్తున్నట్లు తహశీల్దార్ ఉదయ్‌భాస్కర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఉదయ్‌భాస్కర్, సర్పంచి బుద్దా జగ్గారావు, జనసేన పార్టీ మండలాధ్యక్షులు పి.రాము, అధికార ప్రతినిధి జి.రవికుమార్, సొసైటీ అధ్యక్షులు సత్యనారాయణరాజు, ఎంపిటిసి సభ్యులు నాలి శ్రీను, కూటమి నాయకులు జి.లక్ష్మీనారాయణ, అనిల్, మధు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ స్వదేశీ వస్త్రాలు ధరించాలి

ప్రజాశక్తి - ఉంగుటూరు

ప్రతి ఇంట స్వదేశీ చేనేత వస్త్రాలు ధరించాలని, దేశీయ వస్తువులు వాడుకలోకి తెచ్చుకోవాలని రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పొత్తూరి కృష్ణంరాజు(వాసు) అన్నారు. ఈ నెల 3, 4 తేదీల్లో నారాయణపురంలో లయన్స్ ఆడిటోరియంలో హస్తకళ వస్త్ర ప్రదర్శన జరుగుతుందని శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో తెలిపారు. రాష్ట్రం నలుమూలల నుంచి మన భారతీయ సంస్కృతి ఉట్టిపడేలా చేనేత వస్త్రాలు చీరలు, ఎనర్జీ క్రిస్టల్స్ డైమండ్స్ అందుబాటులో ఉంటాయని తెలిపారు. బిజెపి నియోజవర్గ కన్వీనర్ శరణాల మాలతీరాణి, నగరపాటి సత్యనారాయణ, అడపా శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

బొర్రంపాలెంలో గుంట నక్కలు హల్‌చల్

టి.నరసాపురం :మండలంలోని బొర్రంపాలెంలో గత కొన్ని రోజులుగా గుంట నక్కలు తిరుతున్నట్లు సోషల్ మీడియాలో వీడియో వైరల్ అవుతోంది. స్థానిక పామాయిల్ తోటలో తిరుగుతున్నట్లు స్థానికులకు కనిపించాయని వారు చెబుతున్నారు. గ్రామానికి చెందిన బుజ్జిబాబు పామాయిల్ తోటలో రెండు గుంట నక్కలు సంచరిస్తుండగా, కౌలు రైతు పల్లా రమేశ్ శుక్రవారం ఉదయం వీడియో తీశారని, గత పది రోజులుగా ఇవి తోటలోనే ఆవాసం ఉంటున్నాయని చెబుతున్నారు.

నేటి నుంచి రెవెన్యూ గ్రామసభలు

పోలవరం :ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పట్టా పాస్ పుస్తకాలు మండలంలో శనివారం నుంచి గ్రామసభలు నిర్వహించి రైతులకు పంపిణీ చేస్తామని తహశీల్దార్ బి.సాయిరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గూటాలలో మూడో తేదీ, పట్టిసీమ, వెంకటాపురంలో ఆరో తేదీ, ప్రగడపల్లిలో ఏడో తేదీ, వింజరంలో ఎనిమిదో తేదీల్లో ఆయా సచివాలయాల్లో నిర్వహిస్తామని పేర్కొన్నారు.

నేరాలు - ఘోరాలు

పేకాట, కోడిపందేల స్థావరాలపై దాడి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

ఎర్రంపేట, కన్నాయిగూడెం గ్రామ శివారులో పేకాట, కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎస్ఐ వి.చంద్రశేఖర్ పర్యవేక్షణలో జరిగిన దాడుల్లో నిందితుల నుంచి రూ.13,180 నగదును స్వాధీనం చేసుకున్నారు. న్యూ ఇయర్ సందర్భంగా పలుచోట్ల కోడిపందేలు, పేకాట వంటి కార్యకలాపాలు చోటుచేసుకున్నట్లు గుర్తించిన పోలీసులు, వాటిని అరికట్టేందుకు కఠిన చర్యలు చేపట్టారు. అక్రమ కార్యకలాపాలపై పోలీసు యంత్రాంగం ఉక్కు పాదం మోపిందని అధికారులు తెలిపారు.

పలు గ్రామాల్లో..

చింతలపూడి : పేకాట స్థావరంపై దాడి చేసిన పోలీసులు పలువురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టాయిగూడెం, ఊటసముద్రం గ్రామాల్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు సిఐ క్రాంతికుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ సతీష్‌కుమార్ తన సిబ్బందితో శుక్రవారం దాడి చేశారు. ఈ దాడిలో 18 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.33,250 నగదును స్వాధీనం చేసుకున్నారు.

సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించాలి

జిల్లా ఉద్యానవన శాఖాధికారి సంతోష్

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఆయిల్‌పామ్ తోటల సాగులో సమగ్ర సస్యరక్షణ యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా ఉద్యానవన శాఖాధికారి సంతోష్ తెలిపారు. మండలంలోని దాట్లవారిగూడెంలో గిరిజన రైతులకు ఉద్యానవన పంటల సాగుపై అవగాహన సదస్సు నిర్వహించినట్లు ఉద్యానవన శాఖాధికారిణి ప్రసన్నలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యానవన శాఖాధికారి సంతోష్ మాట్లాడుతూ ఆయిల్ పామ్ తోటల పెంపకంలో సమగ్ర సస్యరక్షణ యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా అధిక దిగుబడి వస్తుందన్నారు. పంటల సాగులో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త ఎంవి.ప్రసాద్, సర్పంచి కుంజా పార్వతి రాముడు, ఉద్యానవన శాఖాధికారులు ప్రసన్న, ఎన్.లక్ష్మి, ధీరజ్ లక్ష్మణ్, విలేజ్ ఉద్యానవన అసిస్టెంట్ ఉషా, మండల ఉద్యానవన శాఖ సిబ్బంది, నవభారత్ కంపెనీ సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

యువత జూదం వైపు వెళ్లకుండా క్రీడల వైపు వెళ్లాలని క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి అన్నారు. మండలంలోని నిర్వాసిత కాలనీ చీడురులో స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ఆమె చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత సంక్రాంతి పండుగ ముసుగులో జూదం వైపు వెళ్లకుండా క్రీడల వైపు వెళ్లాలనే ఉద్దేశంతో నిర్వాసిత కాలనీల్లో ఉండే యువతకు క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడల సందర్భంగా నిర్వాసిత కాలనీల్లో ఉంటున్న యువత మధ్య వివాదాలు లేకుండా స్నేహ సంబంధాలు పెరిగేలా దోహదపడుతుందని ఆమె తెలిపారు.

లక్ష్మీపురంలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - దెందులూరు

పెదవేగి మండలంలో ప్రతి గ్రామంలో ప్రతి శనివారం నిర్వహించే శానిటేషన్‌తో పాటు, కొన్ని గ్రామాల్లో అత్యవసర పారిశుధ్య నిర్మూలన నిర్వహణ చేపడుతున్నారు. ఇందులో భాగంగా కొన్ని పంచాయతీల్లో పేరుకుపోయిన చెత్తను అత్యవసరంగా తరలించేందుకు శని, సోమవారాల మధ్యలో సూపర్ శానిటేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పెదవేగి ఎంపిడిఒ నాగేంద్రకుమార్ శుక్రవారం ఉదయం తెలిపారు. సూపర్ శానిటేషన్ నిర్వహణలో భాగంగా శుక్రవారం లక్ష్మీపురం పంచాయతీలో ఆ గ్రామ సర్పంచి మేకా కనకరాజు నేతృత్వంలో కొంతమంది గ్రామస్తుల సమక్షంలో ఎంపిడిఒ నాగేంద్రకుమార్, పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి కె.వరప్రసాద్‌లు పోలవరం కాలువ సమీపంలో ఉన్న చెత్తను పారి శుధ్య కార్మికులతో ట్రాక్టర్‌పై లోడు చేసి తరలించే కార్యక్రమం చేపట్టారు.

హెల్త్ సబ్ సెంటర్ నిర్మాణానికి నిధులు మంజూరు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

గోపాలపురం ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు ప్రత్యేక కృషితో ద్వారకాతిరుమల మండలం తిమ్మాపురం గ్రామంలో హెల్త్ సబ్ సెంటర్ నిర్మాణానికి రూ.36 లక్షల నిధులు మంజూరయ్యాయి. సబ్ సెంటర్ నిర్మాణానికి టిడిపి తిమ్మాపురం గ్రామ అధ్యక్షులు ఘంట శ్రీనివాసరావు ఆయన తండ్రి నాగేశ్వరరావు జ్ఞాపకార్థం ఆరు సెంట్ల భూమి ఉచితంగా అందించారు. ద్వారకాతిరుమల సొసైటీ ఛైర్మన్ పోలిన శ్రీనివాసరావు ఆ స్థలాన్ని చదును చేశారు. త్వరలో ఎంఎల్ఎ వెంకటరాజు శంకుస్థాపన చేసి హెల్త్ సబ్ సెంటర్ నిర్మాణం ప్రారంభిస్తామని తెలిపారు. పేద ప్రజలకు ఉపయోగపడే సబ్ సెంటర్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజుకు, స్థలం ఉచితంగా ఇచ్చిన, పార్టీ అధ్యక్షులు శ్రీనివాసరావుకు గ్రామస్తులందరి తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు కొయ్యలమూడి వెంకట సరిత రామ్మోహన్‌రావు, పార్టీ గ్రామ అధ్యక్షులు శ్రీనివాసరావు, ఐటిడిపి మండలాధ్యక్షులు ఏపూరి కిషోర్, సీనియర్ గ్రామ నాయకులు ఆచంట సత్యనారాయణ, కానుమిల్లి విష్ణు, గరిమెళ్ల నరసింహారావు, బయ్యారపు శివ, తదితరులు, పాల్గొన్నారు.

గ్రామాలను చెత్త రహితంగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి - ముసునూరు

గ్రామాలను చెత్త రహితంగా తీర్చిదిద్దాలని టిడిపి మండలాధ్యక్షులు గద్దె రఘుబాబు అన్నారు. మండల కేంద్రమైన ముసునూరు గ్రామంలో డిఎల్‌పిఒ సుందరి, ఎంపిడిఒ పిల్లి ఏసుబాబు, ఉప ఎంపిడిఒ బసవరాజు అచ్యుత సత్యనారాయణ, సచివాలయ డిప్యూటీ ఎంపిడిఒ వసంతవాణి ఆధ్వర్యంలో గ్రామంలోని చెత్తను ట్రాక్టర్ ద్వారా చెత్త సంపద కేంద్రాలకు తరలించారు. ఈ కార్యక్రమంలో భాగంగా డిఎల్‌పిఒ సుందరి మాట్లాడుతూ గ్రామాలన్నీ పచ్చదనం పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండి, ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండాలని సచివాలయ సిబ్బందికి, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

భూ సర్వే కార్యక్రమాలు ప్రారంభం

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు మండలంలో నాలుగో విడత భూ సర్వే కార్యక్రమాలు ప్రారంభమయ్యాయని ఏలూరు డివిజన్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే రమణారావు తెలిపారు. దీనిలో భాగంగా భీమడోలు గ్రామంలో కొనసాగుతున్న సర్వే పనులను శుక్రవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమడోలు గ్రామంలో 4990.66 ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నాయన్నారు. సర్వే కోసం వీటిని 14 బ్లాక్‌లుగా విభజించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రీసర్వే సర్వేయర్ కామేష్, మండల సర్వేయర్ ధర్మారావుతో పాటు, గ్రామ రెవెన్యూ అధికారులు వినయ్, ప్రతాప్ పాల్గొన్నారు.


పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - భీమడోలు

విద్యార్థులు సోషల్ మీడియా సేవలను సమాచార సేకరణకు, జనార్జనకు వినియోగించాలని భీమడోలు ఎస్ఐ షేక్ మదీనా భాషా కోరారు. పూళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు భువనేశ్వరరావు అధ్యక్షతన భీమడోలు ఎస్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం డయల్ 112, పోక్సో చట్టం, సోషల్ మీడియా వినియోగం, సైబర్ నేరాలు, బాల్య వివాహాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భీమడోలు ఎస్ఐ పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పట్టాదారు పాస్ పుస్తకాలు వినియోగించుకోవాలి

జిల్లా జాయింట్ కలెక్టర్ ఎంజె.అభిషేక్‌గౌడ



పెదపాడు : పాస్ పుస్తకాలు అందిస్తున్న జెసి

ప్రజాశక్తి - పెదపాడు

రీ-సర్వే అనంతరం రాజముద్రతో ముద్రితమైన కొత్త పట్టాదారు పాసు పుస్తకాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎంజె.అభిషేక్ గౌడ చెప్పారు. పెదపాడు మండలం పాతముప్పర్రు గ్రామ పంచాయతీ వద్ద శుక్రవారం ఈదులగుంట గ్రామానికి సంబంధించిన రీ-సర్వే అనంతరం రాజముద్రతో ముద్రితమైన కొత్త 95 పట్టాదారు పాసు పుస్తకాలను రైతులకు అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ మండలంలో మొదటివిడతగా 1,256 పాసు పుస్తకాలు వచ్చాయని, ఈదులగుంట గ్రామానికి ఈరోజు 95 పాస్‌పుస్తకాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎ.కృష్ణజ్యోతి, రీ-సర్వే డిప్యూటీ తహశీల్దార్ వి.రామారావు, సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది, సన్న, చిన్నకారు రైతులు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి : రైతులందరూ రెవెన్యూ గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ షేక్ లతీఫ్ పాషా అన్నారు. మండలంలోని అల్లూరు, కోమర్రు, బొమ్మినంపాడు గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ గ్రామ సభలు నిర్వహించారు. ఈ సభల ద్వారా 300 పట్టాదారు పాస్ పుస్తకాలు రైతులకు పంపిణీ చేశారు. మండలవ్యాప్తంగా 10,981 పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఒలు శ్రీరాములు, ఏడుకొండలు, సర్పంచులు దారం సుధ, కూనపరెడ్డి శ్రీసాయికృష్ణ, శీలం రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు ఆదిలక్ష్మి, శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

సీజనల్ వ్యాధులు విజృంభించే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఏలూరు అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు సూచించారు. అనారోగ్య సమస్యలు తలెత్తిన వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలని ఆయన తెలిపారు. స్థానిక ఏలూరు ఎఎస్ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గొల్లాయిగూడెం ప్రాంతంలో శుక్రవారం నిర్వహించిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శీతాకాలంలో ముఖ్యంగా చలి వాతావరణం కారణంగా దగ్గు, జలుబు, ఆయాసం, అలర్జీ సమస్యలు, వైరల్ ఫీవర్స్ ఎక్కువగా వచ్చే అవకాశముందని తెలిపారు. శీతాకాలంలో వేడి వేడి ఆహార పదార్థాలు తీసుకోవాలని, గోరువెచ్చని నీటిని తాగాలని, చలి తగలకుండా ఉన్ని దుస్తులు వాడాలని సూచించారు. దోమల వల్ల వచ్చే వ్యాధులను నివారించేందుకు పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలని చెప్పారు. ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రి సేవలను వినియోగించుకోవాలని, అక్కడ రక్త, మూత్ర పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారని, అవసరమైన మందులు కూడా ఉచితంగా అందిస్తారని తెలిపారు. ముఖ్యంగా డెంగీ, మలేరియా వ్యాధులకు కారణమైన దోమలు ఇళ్లలోని మంచి నీటి నిల్వ ప్రాంతాల్లోనే ఎక్కువగా పెరుగుతాయని హెచ్చరించారు. అందుకే నీళ్ల తొట్లు వారానికి ఒకసారి శుభ్రం చేసి మూతలు పెట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యుపిహెచ్‌సి ఎఎస్ కాలనీ వైద్యాధికారి డాక్టర్ నవ్య, మలేరియా హెల్త్ అసిస్టెంట్లు మేకా శ్రీనివాసరావు, సురేష్, ఆరోగ్య కార్యకర్త ఆదిలక్ష్మి, ఆశా కార్యకర్తలు, దేవి తదితరులు, స్థానిక పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

ఆర్‌జియుకెటి ఆధ్వర్యాన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండలంలోని బోరవంచ గ్రామంలో నూజివీడు క్యాంపస్‌కు చెందిన ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో ఏడో రోజు ప్రత్యేక శిబిరం విజయవంతంగా నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ పివి.లక్ష్మణరావు, ప్రోగ్రాం ఆఫీసర్ బి.లక్ష్మణరావు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సమక్షంలో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఉదయం ఎన్ఎస్ఎస్ గీతంతో కార్యక్రమాలు ప్రారంభమై, శిబిరంపై స్థానిక గ్రామస్తుల అభిప్రాయాలను సేకరించారు. గ్రామాభివృద్ధి కార్యక్రమాలపై గ్రామస్తుల నుంచి మంచి స్పందన లభించింది. గ్రామాభివృద్ధికి తమ వంతు సేవ అందించినట్లు ప్రోగ్రాం ఆఫీసర్ లక్ష్మణరావు, వాలంటీర్లు తెలిపారు. ఈ కార్యక్రమాలను ఆర్‌జియుకెటి నూజివీడు డైరెక్టర్ డాక్టర్ అమరేంద్ర కుమార్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బి.లక్ష్మణరావు ప్రశంసిస్తూ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సేవా నిబద్ధత అభినందనీయమని తెలిపారు. రావిచర్ల గ్రామంలో ఎన్ఎస్ఎస్ యూనిట్-3 ఆధ్వర్యంలో ఏడో రోజు ప్రత్యేక శిబిరం కార్యక్రమాలు ఘనంగా ముగిశాయి. ప్రభాత సమావేశంలో భాగంగా గ్రామంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సత్యదేవ్ పాల్గొని వాలంటీర్లకు ప్రోత్సాహం అందించారు. ర్యాలీ ద్వారా గ్రామస్తులకు సామాజిక బాధ్యత, పరిశుభ్రత, ప్రజా అవగాహన అంశాలపై సందేశాలు అందించగా, గ్రామస్తుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమాలను ఆర్‌జియుకెటి నూజివీడు డైరెక్టర్ డాక్టర్ అమరేంద్రకుమార్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బి.లక్ష్మణరావు అభినందిస్తూ, వాలంటీర్ల సేవలను కొనియాడారు.

సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - చింతలపూడి

సిఎం సహాయ నిధి ఎంతగానో ఆపదలో ఉన్నవారికి ఉపయోగపడుతుందని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. చింతలపూడి ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో స్థానిక నాయకులతో కలిసి మండలంలోని గణిజర్ల, రాఘవపురం గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సిఎంఆర్‌ఎఫ్ సహాయ నిధి ద్వారా ఇద్దరికి రూ.1,82,373 చెక్కులను అందుకున్న లబ్ధిదారులు కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వికెఎం.శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు సమస్యను పరిష్కరించాలని వినతి



వినతి అందిస్తున్న కన్నాయగూడెం వాసులు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

కన్నాయగూడెం-పొంగుటూరు రహదారిపై తీవ్రంగా దుమ్ము, ధూళి ఎగసిపడుతుందని, దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కన్నాయగూడెం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై గ్రామస్తులు పొంగుటూరు గ్రామ సెక్రటరీ రుక్సానాకు శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ రహదారిపై దుమ్ము కారణంగా దుకాణాలు కూడా తెరవలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. భోజనం చేసేటప్పుడు భోజనంలో దుమ్ము పడుతోందని, తాగే నీటిలో కూడా ధూళి కలుస్తోందని తెలిపారు. రహదారి మీద వాహనాల రాకపోకలతో ప్రమాదాలు జరుగుతున్నాయని, దుమ్ము వల్ల శ్వాసకోశ సంబంధిత అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు. ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరగా పంచాయతీ నిధుల నుంచి రహదారిపై నీళ్ల తడపడం (వాటర్ స్ప్రింక్లింగ్) చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మద్దుకూరి ప్రసాద్, విస్సాకోటి సతీష్, గుడపాటి సతీష్, మన్నిడి వెంకన్న, గంగాధరుని ఫణీంద్ర, యు.దానయ్య, కేసన రామాంజనేయులు, గుడపాటి శేఖర్, మన్నిడి సత్తిరాజు, తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్‌లో విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

పజాశక్తి - కొయ్యలగూడెం

కొయ్యలగూడెం మండల కేంద్రంలో ఉన్న బిసి బాలికల సంక్షేమ హాస్టల్‌లో వాసవి గ్రూప్, ప్రముఖ వ్యాపారవేత్త కొల్లూరి సత్యనారాయణ సహకారంతో విద్యార్థినులకు అవసరమైన దుప్పట్లు, పరుపులను పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బాలరాజు మాట్లాడుతూ బాలికల విద్యను ప్రోత్సహించినప్పుడే రాష్ట్రం సమగ్రంగా అభివృద్ధి చెందుతుందని స్పష్టం చేశారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన పేద, వెనుకబడిన బాలికలకు హాస్టళ్లలో సౌకర్యవంతమైన వసతులు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. విద్యార్థినులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చదువుపై పూర్తి దృష్టి పెట్టేందుకు ఇటువంటి సేవా కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు దుగ్గిన శ్రీనివాస్, కోన కుమార్‌బాబు, తహశీల్దార్ నాగరాజు, వాసవి, దీపావళి ఫ్రెండ్స్ టీమ్ సభ్యులు నల్లజర్ల అనిల్‌కుమార్, కొనకళ్ల ఉదయ్‌కుమార్, ఉప్పల మోహన్‌సాయి, బొమ్మ వినయ్, అద్దేపల్లి కేశవ, గుడిమెట్ల సుబ్రహ్మణ్యం, మట్టే శ్రీను, ఉప్పల మణి, బొమ్మ సాయి, నల్లజర్ల సునీల్, గుడిమెట్ల రాంబాబు, గుడిమెట్ల నరసింహారావు, బొమ్మ వంశీ, బొమ్మ ఫణి, అద్దేపల్లి మణితేజ, వెత్స రాజా, కొల్లూరి శివ భాస్కర్, తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.


ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులపై దృష్టి పెట్టాలని ఆర్‌డిఒ ఎంవి.రమణ బిఎల్‌ఒలను ఆదేశించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బూత్ లెవెల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆర్‌డిఒ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో తప్పులు లేకుండా సవరణ చేయాలన్నారు. 2002 సంవత్సరం నుంచి ఉన్న ఓటర్ల జాబితాను పున:పరిశీలించి 35 ఏళ్లు నిండిన ఓటర్ల వివరాలను యాప్‌లో నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఉదయ్ భాస్కర్, ఎంపిడిఒ కె.వెంకటలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ సిహెచ్.కాంతమ్మ, మండలంలోని పలువురు బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్లు బహూకరణ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్



కంప్యూటర్లు అందిస్తున్న దాతలు

మండల పరిధిలోని అన్నవరం గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఐడిబిఐ బ్యాంకు వారు రూ.75 వేల విలువైన రెండు కంప్యూటర్లు, ఒక ప్రింటర్ బహూకరించారు. బ్యాంకు మేనేజర్ ప్రదీప్ విజయ్, బ్యాంక్ సిబ్బంది, చంద్రాల బ్యాంక్ మేనేజర్ బంగారు బాబు, అసిస్టెంట్ మేనేజర్ అభిలాష్‌రెడ్డి కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయకుమారి మాట్లాడుతూ బహుకరించిన రెండు కంప్యూటర్లు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. బ్యాంకు మేనేజర్ ప్రదీప్ విజయ్ మాట్లాడుతూ అన్ని రంగాల్లో కంప్యూటర్ పరిజ్ఞానం అవసరమని, కంప్యూటర్లను ఉపయోగించుకుని, పై తరగతుల్లో కంప్యూటర్‌లో నిష్ణాతులు కావాలని, మంచి ఉద్యోగాలు పొందాలని కోరారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అన్నవరం విద్యా కుటుంబం తరపున బ్యాంకు వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చెన్నకేశవరావు, బాబూరావు, నాగరాజు, ఫిలోమిన, జయకుమారి, దుర్గా మల్లేశ్వరరావు, జాస్మిన్, శ్రీ మంగలక్ష్మి, వెంకటరమణ, బివిడిఎస్.ప్రసాద్, రాజేంద్రప్రసాద్, కృష్ణకుమారి, ఫిజికల్ డైరెక్టర్ రవీంద్ర పాల్గొన్నారు.

ఓటర్ల మ్యాపింగ్ త్వరగా పూర్తి చేయాలి

ఆర్‌డిఒ వెంకటరమణ

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలో ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ వెంకటరమణ ఆదేశించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఓటర్ మ్యాపింగ్‌పై శుక్రవారం బిఎల్‌ఒలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2002 ఓటర్ జాబితాకు 2025 ఓటర్ల జాబితాకు మ్యాపింగ్ పూర్తి చేయాలని, అందుకు సంబంధించి బిఎల్‌ఒలకు పలు సలహాలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ టి.సత్యసాయి బాబా, సీనియర్ అసిస్టెంట్ బి.హరిబాబు, పలువురు బిఎల్‌ఒలు, తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు టిటిడి డైరీల పంపిణీ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని కోర్టు ఆవరణలో న్యాయవాది పరిషత్, 15వ అదనపు జిల్లా కోర్టు విభాగం, కృష్ణా జిల్లా పరిషత్‌ల ఆధ్వర్యంలో నూజివీడు న్యాయవాదులకు శుక్రవారం తిరుమల తిరుపతి దేవస్థానం డైరీలను పంపిణీ చేశారు. జిల్లా న్యాయవాది పరిషత్ అధ్యక్షులు వై.హరిబాబు, మాజీ అధ్యక్షులు వైఎస్.దొరైలు మాట్లాడుతూ సంప్రదాయ బద్ధంగా ప్రచురించే తిరుమల తిరుపతి దేవస్థానం డైరీలను ప్రతి ఏడాది ఇలా అందించడం బాధ్యతగా స్వీకరించామన్నారు. అన్ని వివరాలతో డైరీలు ప్రచురితమయ్యాయన్నారు. నూజివీడు పరిధి అధ్యక్షులు రామినేని రామకృష్ణ, ముఖ్య కార్యదర్శి చింత తేజ చంద్, కోశాధికారి కరుణాకరరావు, ఇసి మెంబర్ బి.రామకృష్ణ, ఫణి రాజాశేఖర్, బి.శ్రీనివాసరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలోని ముక్కంపాడు గ్రామంలో కోనూరు రత్తయ్య తల్లి ఇటీవల అనారోగ్య సమస్యలతో మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని రెయిన్‌బో ఫార్మసీ అధినేత తాళ్లూరి శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించి నా గ్రామం నా సాయం కింద నగదు అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ చనిపోయిన వారి కుటుంబాలకు మట్టి ఖర్చులకు సహాయం అందించనున్నట్లు చెప్పారు. ప్రతి నెలా తన జీతంలో రూ.పది వేలు నా గ్రామానికి అందించాలని నిర్ణయమని తెలిపారు. భవిష్యత్తులో ఇంజినీరింగ్, డిగ్రీ చదివే వారికి ఉద్యోగావకాశలు, వారికి స్కిల్స్ నేర్పించాలని ఆలోచన ఉందని, త్వరలో ఇది కూడా చేస్తానని చెప్పారు. చదువుకున్న యువతకు ఉద్యోగావకాశం దిశగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ప్రజా సమస్యల పరిష్కార యజ్ఞం నిరంతరంగా కొనసాగుతుందని టిడిపి జిల్లా అధ్యక్షులు, ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి స్పష్టం చేశారు. ఏలూరులోని ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించగా, మిగిలిన వాటిపై సత్వర చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలెవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని, రానున్న రోజుల్లో అన్ని సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపుతామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పలువురు నాయకులు, కార్యకర్తలు ఆయనను దుశ్శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇడా ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, టిడిపి నగరాధ్యక్షులు చోడే వెంకటరత్నం, సీనియర్ నాయకులు బెల్లపుకొండ కిషోర్ పాల్గొన్నారు.

మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి(సీనియర్ డివిజన్) వారి కోర్టులో

FDI.A.No.7/2025in O.S.No.344/2011

Between:-

1. శ్రీమతి అన్నమరెడ్డి నాగమణి
2. శ్రీ అన్నమరెడ్డి దుర్గాప్రసాద్ ...పిటిషనర్స్/వాదులు

మరియు

1. శ్రీ అన్నమరెడ్డి గాంధీ(డైడ్)
2. శ్రీ అన్నమరెడ్డి బాపిరాజు(డైడ్)
3. శ్రీ అన్నమరెడ్డి వేణుగోపాలరావు వగైరా ...రెస్పాండెంట్లు/ప్రతివాదులు

To.

5వ7వ మరియు10వ రెస్పాండెంట్లు/ప్రతివాదులు

5. శ్రీమతి అన్నమరెడ్డి @ పర్వతనేని లీల, D/o. లేట్ బాపిరాజు, వయస్సు 36 సంవత్సరాలు, గృహిణి, D.No. 26-105, జంగారెడ్డిగూడెం, జంగారెడ్డిగూడెం మండలం, ఏలూరు జిల్లా...

7. శ్రీమతి అన్నమరెడ్డి @ వడ్లమూడి సరిత, D/o. లేట్ బాపిరాజు, వయస్సు 34 సంవత్సరాలు, గృహిణి, D.No. 26-105, జంగారెడ్డిగూడెం, జంగారెడ్డిగూడెం మండలం, ఏలూరు జిల్లా..

10. కుమారి ఉప్పలపాటి శ్రీజ, D/o. లేట్ దుర్గాప్రసాద్, వయస్సు 20 సంవత్సరాలు, స్టూడెంట్, C/o. శ్రీ అన్నమరెడ్డి మురళి మోహన్, C.M.R. షాపింగ్ మాల్ ప్రక్కన, బాలాజీ Enclave అపార్ట్ మెంట్, కాలేజీ రోడ్, జంగారెడ్డిగూడెం, జంగారెడ్డిగూడెం మండలం, ఏలూరు జిల్లా.,

పై నెంబరు పిటిషనులో పిటిషను సంగతులు తెలియజేయు నిమిత్తం 5వ, 7వ మరియు 10వ రెస్పాండెంట్లుకు శ్రీ కోర్టు వారి ద్వారాను మరియు రిజిస్టర్ పోస్ట్ ద్వారాను ఎన్ని పర్యాయాలు నోటీసులు పంపినప్పటికీ సదరు 5వ, 7వ మరియు 10వ రెస్పాండెంట్లు బుద్ధి పూర్వకముగా avoid చేయుచున్న కారణంగా శ్రీ కోర్టువారు ఉత్తర్వుల ప్రకారం పేపరు ప్రచురణ ద్వారా FDI.A. No. 7/2025 in O.S. No.344/2011 లో పిటిషన్ సంగతులు తెలియజేయడమైనది. మీకు ఏవైనా అభ్యంతరములు వున్నయెడల **ది.19-01-2026**వ తేదిన ఉదయం **10-30ని॥లకు** శ్రీ కోర్టువారి ఎదుట మీరు స్వయంగా కానీ, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై ఏమైనా ఆక్షేపణలు వున్న యెడల తెలియ పర్చుకోవచ్చును. లేనియెడల వారి పరోక్షమున తీర్మానించడమగునని ఇందుమూలముగా తెలియ జేయడమైనది.

వాయిదా:- 19-01-2026

అత్కూరి సత్యనారాయణ
పిటిషనర్లు తరపు అడ్వకేట్

కొవ్వూరు
ది.22-12-2025

కొవ్వూరు
సెల్.9849847197